జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 178 14-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

- పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయం
- ప్రాజెక్టుల కోసం రూ.35,313 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం
- జలధార పనులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆదేశం
- 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణకు ఏపీఎస్ఐడీసీకి బాధ్యతలు

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోమవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లోని గ్యాప్ 1, గ్యాప్ 2తో పాటు పవర్ హౌస్ నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ప్రాజెక్టు ప్రదేశం నుంచే రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2వ పేజీలో

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...

- ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?: మంత్రి కొల్లు రవీంద్ర
- పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ
- విశాఖ పడవ ప్రమాద బాధితులకు 72 గంటల్లోనే రూ.10 లక్షల సాయం అందించిన ప్రభుత్వం
- వైసీపీ హయాంలో 63 మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపణ
- వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి అందించిన కూటమి సర్కార్
- జువ్వలదిన్నెలో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోబోమని జగన్‌కు హెచ్చరిక



2లో

## విరాళాల గల్లంతుపై సుప్రీం సీరియస్

యూపీ సిట్ నివేదిక కోరిన అత్యున్నత న్యాయస్థానం

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు నోటీసు జారీ



## అనుమతుల సాధనే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రాజెక్టులు, రవాణా వసతులకు అవసరమైన అనుమతులు సాధించాలి
- ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయండి
- పార్టీలకతీతంగా అవసరమైన సమాచారం అందజేస్తాం
- ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా కలిసి ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీలకు పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంవద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా

- మిగతా 2వ పేజీలో



## హత్యలు చేసి.. మేనమామ ఊళ్లో శవమై

- పెంజర్ల శివారులో పోక్సో కేసు నిందితుడి ఆత్మహత్య
- పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్న పోలీసులు
- ఎప్పుడు, ఎలా చనిపోయాడనేది పోస్టుమార్టం రిపోర్టులో తేలుతుందన్న సీపీ
- హత్యలకు ముందే సెల్ఫీ వీడియో తీసుకున్న రాజ్‌కుమార్
- అంతా తనను మోసం చేశారని, అంతమొందించేదాకా నిద్రపోనని వెల్లడి

రంగారెడ్డి జిల్లా: భార్యాపిల్లలు సహా ఆరుగురిని దారుణంగా హత్య చేసిన పార్వతి రాజ్‌కుమార్ (28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని స్వగ్రామమైన దైవాలగూడకు 30 కిలోమీటర్ల దూరంలోని మేనమామ ఊరైన పెంజర్లలో సోమవారం మధ్యాహ్నం అతని మృతదేహాన్ని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## నేడు విశాఖలో వైఎస్ జగన్ పర్యటన

బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న మాజీ సీఎం

## కాళేశ్వరంపై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు..

- గోదావరి నీళ్లు సముద్రంలోకి వెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- కేసీఆర్ కీర్తిని దెబ్బతీసేందుకే కుట్ర జరుగుతోందని వ్యాఖ్య
- వెంటనే నీటిని ఎత్తిపోయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరిక



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను ఉద్దేశపూర్వకంగానే సముద్రం పాలు చేస్తూ రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు.సోమవారం కరీంనగర్ జిల్లాలోని మిడ్ మానేరు జలాశయాన్ని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వేల టీఎంసీల గోదావరి జలాలు



## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స
- మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు
- ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం

- మిగతా 2వ పేజీలో

## దేవాదుల పనులు వేగవంతం చేయాలి

- డిసెంబర్ 2027 నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- అన్ని పంపులను 24 గంటలూ నడపాలి -- వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు
- దేవాదుల పూర్తయితే దాదాపు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు
- కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఎన్‌డీఎస్ఏ మార్గదర్శకాలే అమలు



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



## విరాళాల గల్లంతుపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిర నిర్మాణానికి భక్తుల నుంచి సేకరించిన భారీ విరాళాల గల్లంతు, నిధుల గోల్‌మాల్ ఆరోపణలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పురోగతికి సంబంధించిన సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించింది. విరాళాల చోరీ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌తో పాటు కేంద్రం, యూపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రామమందిర విరాళాల వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరిపించాలని, కాగ్ ఆడిటింగ్, స్వతంత్ర ఏజెన్సీతో ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని నరేంద్ర కుమార్ గోస్వామి, ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్, న్యాయవాదులు అజయ్ రాయ్, దినేశ్ యాదవ్, హిందూ ధర్మ పరిషత్ తదితరులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. విరాళాల వినియోగంలో పారదర్శకత కోసం ట్రస్ట్ ఆడిట్ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని, కోర్టు నియమించే పర్యవేక్షక కమిటీ ఆమోదం లేకుండా ట్రస్ట్ కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంలో దాఖలైన పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం సోమవారం విచారించింది. ఆర్థికపరమైన, సంక్లిష్టమైన ఈ కుంభకోణాన్ని లోతుగా దర్యాప్తు చేసేందుకు అవసరమైన ఫోరెన్సిక్, ఇన్వెస్టిగేటివ్ మౌలిక సదుపాయాలు యూపీ సర్కారు ఏర్పాటు చేసిన సిట్‌కు లేవని పిటిషనర్లు పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా సిట్ విచారణ ప్రారంభించిందని, దీనివల్ల వారు సేకరించిన ఆధారాలకు చట్టబద్ధత ఉండదని, వాటిని సులభంగా సవాల్ చేసే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## నేడు విశాఖలో వైఎస్ జగన్ పర్యటన

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోనున్నారు. బోటు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులను వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ విషాద ఘటనపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను నేరుగా వైఎస్ జగన్ పరామర్శించి వారికి ధైర్యం చెప్పనున్నారు. వైఎస్ జగన్ మంగళవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరుతారు. విశాఖపట్నం చేరుకున్న అనంతరం జబ్బార్ తోటలో బాధిత మత్స్యకారుల కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం ప్రమాదం నుంచి బయటపడిన కారి చిన్నాను పరామర్శించి దుర్ఘటన జరిగిన తీరు గురించి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం తిరిగి తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

## దేవాదుల పనులు వేగవంతం చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూలై 13: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీరు, సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదుల ఎత్తిపోతల పథకంలోని అన్ని పంపులను నిరంతరం 24 గంటల పాటు నిర్వహించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో నింపి నీటి భద్రతను కల్పించాలని స్పష్టం చేశారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ--గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, అనంతరం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు మూడో దశ పనులను వేగవంతం చేయడంపై అధికారులకు స్పష్టమైన కార్యాచరణను సూచించారు. ప్రస్తుతం గోదావరి నదిలో సుమారు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నందున ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఏడు పంపులు పనిచేస్తూ తాగునీరు, సాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోస్తున్నాయని అధికారులు వివరించారు. మొత్తం పది పంపులు పనిచేస్తే రోజుకు 0.23 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉండగా, సుమారు నాలుగున్నర రోజుల్లో ఒక టీఎంసీ నీటిని తరలించవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడల్లా గరిష్ట స్థాయిలో నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని మంత్రి స్పష్టం చేశారు. గోదావరిలోని ఇంటేక్ నిర్మాణాలు, భారీ పంప్ హౌస్‌లు, రైజింగ్ మెయిన్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రావిటీ కాలువల పనులను సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మూడు దశల పనులు పూర్తయినప్పుడే ప్రాజెక్టు పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని, ఒక్క ఎకరం కూడా మిగలకుండా ఆయకట్టుకు నీరందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి ప్యాకేజీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నెలవారీగా పురోగతిని సమీక్షించాలని ఇంజినీర్లకు ఆదేశించారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

(మొదటి పేజీ తరువాయి)

కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

# మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...

ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని,



వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## హత్యలు చేసి.. మేనమామ ఊళ్లో శవమై

(మొదటి పేజీ తరువాయి)



క్లూస్ టీంను పిలిపించి, ఆధారాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడకు చెందిన పోక్సో కేసు నిందితుడు రాజ్‌కుమార్..తనపై లైంగిక వేధింపుల కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు వారికి సహకరించిందనే కోపంతో భార్యను అలాగే ఇద్దరు కొడుకుల్నీ శుక్రవారం రాత్రి కత్తితో పొడిచి, గొంతులు కోసి చంపిన సంగతి తెలిసిందే. అయితే హత్యాకాండ తర్వాత కారులో షాద్‌నగర్ వైపు వచ్చిన రాజ్‌కుమార్ శనివారం ఉదయం తిమ్మాపూర్ సమీపంలో వాహనాన్ని వదిలేసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అయితే సోమవారం మధ్యాహ్నం అతని మృతదేహం కని?పించింది. పక్కనే పురుగుల మందు డబ్బా ఉండటంతో అది తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్యకు ముందుఎవరెవరిని కలిశాడు? షాబాద్ నుంచి ఏ రూట్లో ఇక్కడికి చేరుకున్నాడు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 'రాజ్‌కుమార్ పేరున 16 సిమ్ కార్డులు ఉన్నట్లు గుర్తించాం. ఐదారు సెల్ ఫోన్లు వాడాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఎక్కువగా ఆడేవాడు. రూ.2 కోట్లకు పైగా అప్పులు చేశాడు. ఒత్తిడితో సైకోగా మారాడు. మే 16న అతనిపై పోక్సో కేసు నమోదైంది. అయితే పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంలోకి వెళ్లాడు. జూన్‌లో ముందస్తు బెయిల్ తీసుకుని బయటికి వచ్చాడు. నిందితునికి ఒక స్కూటీ ఉంది. కాగా జూలై 10న ఓ కంపెనీ నుంచి కారు అద్దెకు తీసుకున్నాడు. ఫోన్‌పే ద్వారా రూ.2 వేలు చెల్లించాడు. రాత్రి 10.30 గంటల తర్వాత కారులో షాబాద్ చేరుకున్నాడు. కారును ఇంటి వెనుకవైపు ఉన్న గ్రౌండ్‌లో పార్కు చేశాడు. ప్రహరీ దూకి మైనర్ బాలిక (17) ఇంటికి చేరుకున్నాడు. తలుపు తీసిన తల్లి చిట్యాల లక్ష్మి?మ(45)ని కత్తితో పొడిచి చంపాడు. అడ్డుకోబోయిన బాలిక నానమ్మ రుక్కమ్మ (60) గొంతు కోశాడు. బాలికను బలవంతంగా అక్కడి నుంచి దైవాలగూడకు తీసుకెళ్లాడు. ఆమెను హత్య చేసిన తర్వాత ఇంటికి వెళ్లి.. భార్య సరిత, ఇద్దరు పిల్లలను అదే కత్తితో గొంతుకోసి చంపాడు. అప్పటినుంచి నిందితుడి కోసం 12 బృందాలతో గాలిస్తున్నాం. సాంకేతిక ఆధారాలు సేకరించాం. బంధువులు, స్నేహితులను కూడా విచారించాం. రాజ్‌కుమార్ దగ్గర నగదు కూడా ఎక్కువ లేదు. అద్దెకు కారును చేగూరు వద్ద వదిలి వెళ్లాడు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు..

(మొదటి పేజీ తరువాయి)

వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోవడమే కాకుండా, హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరికి వరద ప్రవాహం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నీటిని విజయవంతంగా ఎత్తిపోస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మరమ్మతులు పూర్తయినప్పటికీ, కేవలం రాజకీయ దురుద్దేశంతో ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికను సాకుగా చూపి తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టుకు చెడ్డపేరు తెచ్చేందుకే కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.35,313 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతి సహా ఇతర ప్రాజెక్టుల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ.3,883 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనుల ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆధునీకరణ కింద మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేక పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ఉద్దేశించిన 'జలధార' కార్యక్రమంపై కూడా సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ ఛానళ్లను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ పనులను వీబీజీ రామ్ జి సంస్థ ద్వారా చేపట్టాలని, జలధార పనుల కోసం ప్రతి జిల్లాకు తక్షణమే రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

# అనుమతుల సాధనే లక్ష్యంగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి అవసరమని, ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-- 1, స్వాదీనం, మెట్రో ఫేజ్--2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం ఎంపీలకు వివరించారు. ఎస్‌బీఐ క్యాప్స్ కన్సల్టెంట్‌గా నియమించే ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉందని సీఎం తెలిపారు. మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు సీఎం తెలిపారు. ఈ పనులను అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సి ఉందని ఈ అంశంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడామని వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్‌ఓసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సీఎం అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150--151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం తెలిపారు. అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్‌కు ఐఏఎస్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌ను నియమించామని సీఎం చెప్పారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సీఎం సూచించారు.

### ఎంపీలు అడిగిన సమాచారం ఇవ్వండి : భట్టి విక్రమార్క

ఎంపీలు అడిగిన ప్రతి సమాచారం అందజేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన లేఖలు, ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ లేఖలు సిద్ధం చేసి పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందుబాటులో ఉంచాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో ముఖ్యమంత్రిగానీ, తాను గానీ స్వయంగా ఢిల్లీకి వస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. అక్కడ ఎంపీలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఏఏ అంశాలపై ఒత్తిడి తేవాలనే దానిపై చర్చిస్తామన్నారు.

# ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలదే కీలక పాత్ర

- అర్హుల పేర్లు నమోదు చేయాలి.. అనర్హుల పేర్లు లేకుండా చూడాలి
- బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**తొలివెలుగు, రాజాపేట :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా పనిచేయాలని ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ బీఎల్ఏల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి బీఎల్ఏ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు, నకిలీ నమోదులు లేదా ఒకే వ్యక్తి పేరు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరుగా నమోదయ్యే పరిస్థితులు లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అలాంటి నమోదులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా వినియోగించుకుని కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బీఎల్ఏలకు సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సటు తిరుమలేష్, సంధిల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, బోగ హరినాథ్, పల్లె సంతోష్, చింతల సంపత్, గుర్రం నర్సిములు, బూర్గు నర్సిరెడ్డి, సోమలింగం, కర్ణాకర్ రెడ్డి, రెడ్డబోయిన రాజు, మేక వెంకటేశ్వర రెడ్డి, చెరుకు కనకయ్య, సామల రమేష్, సత్యనారాయణ రెడ్డి, నాగిర్తి గోపి, బిళ్ళ కుదురు రాజు, వేముల సంపత్, గంధమల్ల సురేష్, లక్ష్మయ్య, రవి, నీల బిక్షపతి, బాలకృష్ణ, కట్కూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



- టీయూడబ్ల్యూజే - ఐజేయూ ఆధ్వర్యంలో కార్యవర్గం ఎంపిక
- ప్రభుత్వం - ప్రజలకు మధ్య వారధిగా మీడియా వ్యవహరించాలి: బాలకోటి రెడ్డి

**తొలివెలుగు, నిడమనూరు :** ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు (టీయూడబ్ల్యూజే - ఐజేయూ) మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించి, తమ ఎన్నికకు సహకరించిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కున్‌రెడ్డి బాలకోటి రెడ్డి (తొలిసాక్షి), గౌరవ అధ్యక్షుడిగా ఒక్కంటి అరుణ్ కుమార్ (ఈనాడు), ప్రధాన కార్యదర్శిగా బత్తుల సూరయ్య నాయుడు (పంతులు) (వార్త), ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి వెంకట్ రెడ్డి (సాక్ష్యం), కోశాధికారిగా జువ్వి రాజు (మన తెలంగాణ), సహాయ కార్యదర్శిగా చీదల్ల నరహరి (సాక్షి) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మొగిలి రవి (విశాల తెలంగాణ), అన్నేబోయిన కొండల్ (నేటి దర్శిని), కంచర్ల రవీందర్ రెడ్డి (ది సౌత్ ఇండియా టైమ్స్), బొజ్జ రవి (క్యాపిటల్ ఇన్ఫర్మేషన్), జేర్రిపోతుల సాయి (తొలివెలుగు)లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కున్‌రెడ్డి బాలకోటి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్తుల సూరయ్య నాయుడు మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి మీడియా తన వంతు పాత్ర పోషించాలని అన్నారు. ప్రభుత్వం - ప్రజలకు మధ్య మీడియా వారధిగా వ్యవహరించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పేర్కొన్నారు. అలాగే మీడియా ప్రతినిధుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే - ఐజేయూ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. నిడమనూరు ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.

# కురవాలి వానలు.. పండాలి చేలు



- మొల్లగూడెంలో మహిళల సామూహిక జాలాభిషేకాలు
- 'గంగవిడము పరమేశా' అంటూ శివునికి ప్రత్యేక పూజలు



**తొలివెలుగు, రాజాపేట:** కరుణించు కురిపించు వరుణదేవా అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం మొల్లగూడెం గ్రామంలో మహిళలు వరుణ దేవుని కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో, గ్రామంలోని మహిళలంతా ఏకమై 'గంగవిడము పరమేశా' అంటూ ఆ పరమశివుడికి మొరపెట్టుకున్నారు. గ్రామ ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ప్రతి ఇంటి నుండి నీటి బిందెలను సేకరించి, వాటికి వేప కొమ్మలను అలంకరించి బొడ్రాయి కూడలి వద్ద ఉంచారు. సాంప్రదాయబద్ధంగా జలకడవాల చుట్టూ తిరుగుతూ, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ భక్తిపాటలు పాడారు. సకాలంలో వర్షాలు పడకపోతే పడే ఇబ్బందులను, ప్రకృతి కరుణిస్తే కలిగే లాభాలను పాటల రూపంలో వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ దేవతలతో పాటు బొడ్రాయికి సామూహిక జాలాభిషేకం చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామ ప్రతినిధులు, మహిళలు నీల కనకమ్మ, జన్నపల్లి కవిత, మాలి గీత, మల్లపురం కవిత, కథ శోభ, నీల కొండమ్మ, భీమనపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహం

- గణేష్ కుమార్తె పేరిట రూ.57,100 ఫిక్స్‌డ్ డిపాజిట్
- నర్సాపురంలో తోటి మిత్రుల మానవత్వం

**తొలివెలుగు, రాజాపేట :** కష్టకాలంలో తోడు నిలిచేవాడే నిజమైన స్నేహితుడని రాజాపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన పలువురు మిత్రులు నిరూపించారు. ఇటీవల అకాల మరణం చెందిన తమ స్నేహితుడు పొన్నోజు గణేష్ కుటుంబానికి తోటి స్నేహితులు, పెద్దలు అండగా నిలిచారు. గణేష్ మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడటాన్ని గమనించిన అతని పదో తరగతి, ఇంటర్మీడియట్ సహచర విద్యార్థులు, స్నేహితులు ఒక తాటిపైకి వచ్చారు. తమ వంతు సాయంగా రూ.57,100 విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని గణేష్ చిన్నారి కుమార్తె భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఆమె పేరున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ (స్థిర డిపాజిట్) చేయించి, ఆ పత్రాలను సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన స్నేహితుల చొరవను గ్రామ పెద్దలు, స్థానికులు అభినందించారు.



# నా కులాన్నే నేను తిడుతానా..?

- కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టేందుకే దుష్ప్రచారం: రామ్మోహన్ గౌడ్
- జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆడియో క్లిప్‌ల వ్యవహారంపై స్పందన
- వైరల్ ఆడియోలపై పోలీసులతో విచారణ జరిపించాలని డిమాండ్

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డికి సంబంధించినట్లు ప్రచారంలో ఉన్న ఆడియో క్లిప్‌ల వ్యవహారం ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తన పేరును ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్మోహన్ గౌడ్ సోమవారం స్పందించారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను గౌడ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాజకీయంగా తనకు అండగా నిలిచిన గౌడ సమాజాన్ని తాను అవమానించే ప్రశ్నే లేదని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో క్లిప్‌లు, వీడియోలు ఎక్కడి నుంచి ప్రచారంలోకి వచ్చాయనే అంశంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. తనపై రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు పూర్తి వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే నమ్మాలని కోరారు. చిన్నప్పటి నుంచే అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ రాజకీయాలు చేస్తున్నానని రామ్మోహన్ గౌడ్ తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించానని, ఆయన జయంతి, వర్ధంతి వేడుకల్లో ముందుండి పాల్గొన్నానని గుర్తుచేశారు. గౌడ సమాజ గౌరవం కోసం పనిచేసిన తాను అదే సమాజాన్ని అవమానించేలా మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో గౌడ సామాజిక వర్గం తనకు విశేష మద్దతు ఇచ్చిందని, ఆ విశ్వాసాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటానని తెలిపారు. ఆ మద్దతును దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే రాజకీయ ప్రత్యర్థులు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జక్కిడి ప్రభాకర్ రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని, గతంలో తనతో కలిసి పనిచేసిన వ్యక్తే ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తనపై జరుగుతున్న ప్రచారానికి సంబంధించిన అంశాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు తెలిపారు. తనపై జరుగుతున్న కుట్రల వెనుక ఉన్న వాస్తవాలను త్వరలో ప్రజల ముందుకు తీసుకువస్తానని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ నాయకుడు బొంగు వెంకటేశ్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు తదితరులు పాల్గొన్నారు.






# లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌కు ఘన స్వాగతం

- విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ
- విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: జిల్లా గవర్నర్ కె.వి. ప్రసాద్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.వి. ప్రసాద్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హాంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం స్వదేశానికి వచ్చిన ఆయనకు క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంకిరెడ్డిగూడెంలోని ప్రభుత్వ మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు జిల్లా గవర్నర్ కె.వి. ప్రసాద్ చేతుల మీదుగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ సేవతో పాటు విద్యా సేవకు కూడా లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు తీగల మోహన్‌రావు, బాచుపల్లి రవీందర్‌రావు, దాచేపల్లి ప్రకాష్, ఉప్పు ఆంజనేయులు, అతహర్ పాషా, దాచేపల్లి రాజు, బత్తిని రఘు, గోశిక కరుణాకర్, కామిశెట్టి భాస్కర్, కాసుల వెంకటేశం, కటకం ప్రశాంత్, కొసనం రామ్‌రెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్, దాచేపల్లి శ్రీను, తిరందాసు జగన్నాథ్, సిలివేరు మంగయ్య, చింతల ప్రభాకర్‌రెడ్డి, వేముల నరసింహ, సరోజ సత్యనారాయణ, పోలోజు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి





- దళితవాడలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సర్వే
- 55 ఏళ్లు నిండిన దళితులకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను తక్షణమే మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గ్రామంలోని దళితవాడలో నిర్వహించిన సర్వే సందర్భంగా వారు కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో గ్రామస్తులు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి సుంకిశాల గ్రామానికి కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గీత, చేనేత కార్మికులకు 55 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్లు మంజూరు చేస్తున్న తరహాలో, సమాజ అభివృద్ధికి శారీరక శ్రమతో విశేష సేవలు అందిస్తున్న 55 సంవత్సరాలు నిండిన దళితులందరికీ కూడా సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగిలిపాక యాదయ్య, పోలేపల్లి స్వామి, నార్కట్‌పల్లి ఎల్లయ్య, దేశపాక మల్లయ్య, దేశపాక యాదయ్య, ఈర్లపల్లి లక్ష్మమ్మ, పోలేపల్లి రాములు, ఈర్లపల్లి నరసింహ, ఇంజమూరి జహంగీర్, ఈర్లపల్లి మల్లేష్, దేశపాక సుదర్శన్, శేఖర్, అశ్విని పాల్గొన్నారు.

# విశేష పుణ్యదినాన శివదర్శనానికి పోటెత్తిన భక్తులు



- మునిపంపుల శివాలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం
- అరుదైన పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు
- శివభక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామ శివాలయంలో సోమవారం విశేష రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం, చతుర్దశి తిథి, పరమేశ్వరుని జన్మ నక్షత్రం ఒకే రోజున కలిసి రావడం అత్యంత విశిష్టమైన పుణ్యకాలంగా భావించబడుతుందని, ఇటువంటి యోగం చాలా అరుదుగా ఏర్పడుతుందని పండితులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస పంతులు ఆధ్వర్యంలో భక్తులు పంచామృతాలతో పరమేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ విశేష రోజున శివునికి అభిషేకం చేస్తే విశేష పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసంతో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగుతూ భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, మన్నె పద్మారెడ్డి, మామిడి పద్మారెడ్డి, సిల్క్ సంఘం చైర్మన్ మిరియాల శ్యాంసుందర్, పల్లివాడ సర్పంచ్ శ్రీనివాస్, భోగిపర్తి జానకిరాములు, ప్రభాకరాచారి, దుర్గయ్య, రాంబాబు, గజ్జల రాము, భోగిపర్తి భాస్కర్, కల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాస శివరాత్రి వేడుకలు

- మహా శైవాక్షయోగం వేళ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో మాస శివరాత్రి వేడుకలు సోమవారం కన్నులపండువగా జరిగాయి. వందేళ్లకు ఒకసారి వచ్చే అత్యంత పవిత్రమైన 'మహా శైవాక్షయోగం' సోమవారం నాడే రావడం వల్ల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజాపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో కొలువైన పరమశివుడికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ ఆధ్వర్యంలో భక్తులు బిల్వపత్రాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాస శివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు.

**పర్వతవర్ధిని ఆలయంలో పూజలు:**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి అనుబంధాలయమైన పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రాజాపేట పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్-భాగ్యలక్ష్మి దంపతులు, వారి కుమారుడు సాయి మనోజ్ కుమార్, మండల ఆర్యవైశ్య సంఘం, జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు ఉప్పల రమేష్, ఉప్పల మనీష్ కుమార్ లు ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి నారికేల జలంతో అభిషేకం చేసి, స్పటిక లింగాన్ని దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి వారి స్వయంభువులను దర్శించుకోగా, వేద పండితులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

# పిల్లల ఆరోగ్యానికే 'ఆల్బెండజోల్'

- రాజాపేట మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం
- 93 శాతం మంది విద్యార్థులకు తొలి రోజే మాత్రల పంపిణీ
- గురుకుల పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కోయ మధు

**తొలివెలుగు, రాజాపేట :** జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజాపేట మండల వ్యాప్తంగా సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గురుకుల పాఠశాలలో సర్పంచ్ కోయ మధు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్, ఆరోగ్య విస్తరణ అధికారి భీకూ నాయక్ మాట్లాడుతూ, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 5,507 మంది విద్యార్థులు ఉండగా, తొలి రోజే 5,098 మంది విద్యార్థులకు (93 శాతం) ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మొదటి రోజు గైర్హాజరైన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన 'మ్యాప్-అప్' కార్యక్రమం నిర్వహించి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రేమలత, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, అనిత, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే

- ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించాలి
- ఓటు హక్కును పరిరక్షించుకోవాలి: మొహమ్మద్ జమీరుద్దీన్



**తొలివెలుగు, రామన్నపేట :** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని సక్రమంగా నింపి సంబంధిత అధికారులకు తప్పనిసరిగా అందజేయాలని రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో), ఎన్నికల అధికారులు లేదా గుర్తింపు పొందిన పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్‌ఏ)కు ఎన్యూమరేషన్ ఫారాన్ని నిర్ణీత గడువులోపు సమర్పించాలని తెలిపారు. ఫారం సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు లేకపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఎంతో కీలకమైందని, ప్రతి కుటుంబం తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎన్నికల అధికారులను సంప్రదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని జమీరుద్దీన్ పిలుపునిచ్చారు. ఎన్నికల అధికారులు నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు.

# కార్మికుల సంక్షేమానికి సహకార సంఘాలే బలం: సంగిశెట్టి సుదర్శన్

- వేడుకగా శ్రీ మార్కండేయ సిల్క్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం
- నూతన కార్యవర్గాన్ని సత్కరించిన సర్పంచ్ బండ సరోజ అంజిరెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** చేనేత కార్మికుల సంక్షేమానికి సహకార సంఘాలే ప్రధాన బలమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి వృత్తిదారుడిపై ఉందని శ్రీ మార్కండేయ సిల్క్ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం నూతన అధ్యక్షుడు సంగిశెట్టి సుదర్శన్ అన్నారు. జనంపల్లి గ్రామ చేనేత కార్మికుల అభ్యున్నతికి, మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న వృత్తిదారుల సంక్షేమానికి శ్రీ మార్కండేయ సిల్క్ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం నిరంతరం కృషి చేస్తుందని సంఘం నూతన అధ్యక్షుడు సంగిశెట్టి సుదర్శన్ అన్నారు. రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామంలో సోమవారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగిశెట్టి సుదర్శన్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత సహకార సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలిగా సంగిశెట్టి విజయలక్ష్మి, కార్యదర్శిగా వనం శంకర్, కోశాధికారిగా పున్న శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే డైరెక్టర్లుగా రమేష్, బిక్షం, గణేష్, కళమ్మ, మహాలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ బండ సరోజ అంజిరెడ్డి, స్థానిక చేనేత కార్మికులు, వృత్తిదారులు నూతన కార్యవర్గ సభ్యులను గజమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





ప్రమాణ స్వీకారం చేసిన వెంకట్ రమణ సిల్క్ చేనేత సహకార సంఘం కార్యవర్గం

# జనంపల్లి చేనేత సంఘం అధ్యక్షుడిగా వనం శ్రీనివాస్

- జనంపల్లి వెంకటరమణ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం
- కార్మికులకు చేతినిండా పని కల్పిస్తాం.. సంఘ బలోపేతానికి సహకరించండి: అధ్యక్షుడు వనం శ్రీనివాస్




అధ్యక్షులు వనం శ్రీనివాస్

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామంలో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడమే నూతన కార్యవర్గం ప్రధాన లక్ష్యమని జనంపల్లి వెంకటరమణ చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడు వనం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎన్నికల అధికారి తరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. చేనేత వృత్తిని పరిరక్షించడంతో పాటు కార్మికుల ఆర్థికాభివృద్ధికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. చేనేత కార్మికులందరూ ఐక్యంగా ఉంటూ సంఘ బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా ఎక్కలదేవి నరసింహ, కార్యదర్శిగా సంగిశెట్టి గోవర్ధన్, కోశాధికారిగా కైరంకొండ సరిత, డైరెక్టర్లుగా సంగిశెట్టి ధనుంజయ, సంగిశెట్టి బిక్షం, కర్నాటి నరసింహ, కైరంకొండ శ్రవణ్‌కుమార్, సంగిశెట్టి అనిత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చేనేత కార్మికులు, పద్మశాలీ సంఘ సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బాబోయ్..ఎండలు

# 35 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత



సిటీబ్యూరో : గ్రేటర్‌లో మళ్లీ ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో నగర వాతావరణం వేసవిని తలపిస్తున్నది. గతంలో ఇదే సమయంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైన సందర్భాలు చాలా ఉన్నాయి. వర్షాలు కురవకపోయినా జూలై మాసంలో సాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30-32 డిగ్రీలు దాటవు. అయితే ప్రస్తుతం వాతావరణం లో నెలకొంటున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. నగరంలో గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు 34-36డిగ్రీల మధ్య నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరం లో గరిష్ఠ ఉష్ణోగ్రత 36.7 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25.4డిగ్రీలు, గాలిలో తేమ 48 శాతంగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# మునిపంపుల పీహెచ్‌సీని 24 గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి






- గ్రామీణ ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి
- సీపీఎం ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిశీలన.. సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన నాయకులు రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. సుమారు 14 గ్రామాల ప్రజలకు సేవలందిస్తున్న ఈ పీహెచ్‌సీకి ప్రతిరోజూ 150 మందికి పైగా ఔట్‌పేషెంట్లు వస్తున్నప్పటికీ 24 గంటల వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాట్లు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులు తక్షణ చికిత్స పొందలేక దూర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని, దీనివల్ల ప్రాణాపాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో కనీస మౌలిక వసతులు కూడా తగినంతగా లేవని, గాయపడిన వారికి కుట్లు వేసే సౌకర్యం సైతం లేకపోవడం విచారకరమన్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించి, అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలు కల్పించి మునిపంపుల పీహెచ్‌సీని 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యురాలు జంపాల అండాలు, మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, శాఖ సహాయ కార్యదర్శి గంటెపాక శివకుమార్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద, మహిళా శాఖ కార్యదర్శి జోగుల ధనలక్ష్మి, నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్, ఎండీ మైనొద్దీన్, జంపాల ఉమాపతి, బూడిద బిక్షం, పుట్టల ఉదయ్‌కుమార్, బూడిద ఆదిత్య పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు బండారు దత్తాత్రేయకు ఆహ్వానం

- 21వ ప్రతిష్ఠా వార్షిక మహోత్సవాల కరపత్రిక ఆవిష్కరణ
- జూలై 16న భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 21వ ప్రతిష్ఠా వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆలయంలో ఉత్సవాల కరపత్రికను ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుల చేతుల మీదుగా కరపత్రికను విడుదల చేసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ప్రారంభించారు. అనంతరం అయ్యప్ప భక్త సమాజం సభ్యులు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే మునుగోడు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా పోలీస్ కమిషనర్ ఆకాంక్ష యాదవ్‌లను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి రాపోలు రామచంద్రం మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీ (గురువారం) అయ్యప్ప స్వామి ప్రతిష్ఠా వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం స్వామివారి మేలుకొలుపుతో కార్యక్రమాలు ప్రారంభమై గణపతి హోమం, స్వామివారికి సర్వాభిషేకాలు, మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం అయ్యప్ప పడి పూజ నిర్వహించనున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త సమాజం అధ్యక్షుడు రాపోలు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు బొబ్బల జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, జాయింట్ కార్యదర్శి భారత్ లవకుమార్, కోశాధికారి చిలువేరు బాల నరసింహ, ధర్మకర్తలు జెల్ల వెంకటేష్, సభ్యుడు భోగ విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి కేసునూ ఆధారాలతో విచారించాలి



యాదాద్రి జోన్ డీఐజీ జోయల్ డేవిస్

నీలగిరి, జూలై 13: విచారణలో భాగంగా ప్రతి కేసు నూ సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిట ల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యా ప్తు చేపట్టాలని యాదాద్రి జోన్-ఎ డీఐజీ జోయల్ డేవిస్ సూచించారు. సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు అత్యుత్తమంగా ఉందని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, అంకిత భావం, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీసు శాఖ అత్యున్నత బాధ్యత అన్నారు. నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమస్యలు, వివాదాలు, అనుమానాస్పద కదలికలపై ముం దస్తు సమాచారం సేకరించి ప్రారంభ దశలోనే అరికట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నల్లగొం డ జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దు కావడంతో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.దఅంతకుముందు ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్ హెచ్ ఓలతో సమావేశమై వారి పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేశ్, డీఎస్పీలు మల్లారెడ్డి, కొలను శివరాంరెడ్డి, శ్రీనివాసరావు, రవి, నగేశ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, జిల్లా సీఐలు, ఆర్ ఎస్సైలు, ఎస్సైలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫలించిన మర్రి పోరాటం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పోరాటంతో గౌతంనగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద రూ.42 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. మల్కాజిగిరి నుంచి గౌతంనగర్ వైపు వెళ్లేమార్గంలో రైల్వే గేటు ఉంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రతిరోజు పలుమార్లు లెవల్ క్రాసింగ్ వద్ద గేటు పడుతుండటంతో వాహనదారుల ఇక్కట్లు ఎక్కువయ్యాయి. ఈ ప్రాంతంలో ఆర్‌యూబీ నిర్మించాలని స్థానికులు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి విన్నవించగా.. ఆయన ఆర్‌యూబీ కోసం పోరాటం చేశారు. రైల్వేశాఖ ఎట్టకేలకు ఆర్‌యూబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల ఆసర్వే అధికారులు స్థల పరిశీలన చేశారు. 'గౌతంనగర్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశాం. తాగునీటి పైపులైన్లు, సీవరేజ్ లైన్లు, డ్రైనేజీ లైన్లు ధ్వంసం కాకుండా పనులు చేపట్టనున్నారు. ఈ ఆర్‌యూబీ అందుబాటులోకి వస్తే మల్కాజిగిరి నుంచి గౌతంనగర్ వైపు వెళ్లేవారికి ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి'.. అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.





# పిల్లల ఆరోగ్యానికి ఆల్బెండాజోల్ రక్షణ

- ఇంద్రపాలనగరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ చేతుల మీదుగా మాత్రల పంపిణీ ప్రారంభం

**తొలివెలుగు, రామన్నపేట:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో సోమవారం ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణతో పాటు పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి అర్హత కలిగిన బాలబాలికకు ఆల్బెండాజోల్ మాత్ర తప్పనిసరిగా వేయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు మాత్రలు వేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సింగణబోయిన గణేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఎంపీహెచ్‌ఏ (ఫీమేల్) జి. సునీత, ఆశా కార్యకర్తలు బాలమణి, వరలక్ష్మి, శ్యామల, వసంత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, నీరుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవనంపై నుంచి దూకి వివాహిత మృతి

- భార్యాభర్తల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఘటన?
- మృతిపై పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని లక్ష్మణ్‌నగర్ కాలనీలో సోమవారం ఓ వివాహిత భవనం పై అంతస్తు నుంచి కిందపడటంతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన కుమావత్ మనీష్ నాలుగేళ్ల క్రితం వ్యాపార నిమిత్తం పోచంపల్లికి వచ్చాడు. ప్రస్తుతం చౌటుప్పల్ చౌరస్తాలో భవాని జ్యువెలర్స్, భవాని క్లాత్ స్టోర్ పేర్లతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని భార్య రాణిదేవి ఉమావత్ (28). వీరికి రెండున్నరేళ్ల కుమారుడు నరేష్ ఉన్నాడు. ఇటీవల లక్ష్మణ్‌నగర్ కాలనీలోని ఓ ఇంటి రెండో అంతస్తులో అద్దెకు నివాసం ఉంటున్నట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం దంపతులు కలిసి భోజనం చేసిన అనంతరం భర్త దుకాణానికి వెళ్లగా, రాణిదేవి ఇంటి వద్ద నుంచి ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. అనంతరం ఆమె భవనం రెండో అంతస్తు నుంచి కిందపడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ భాస్కర్ రెడ్డి, మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

# విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

- జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండాజోల్ పంపిణీ
- ప్రతి విద్యార్థి మాత్ర తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా భూదాన్ పోచంపల్లి మండల, పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణితో కలిసి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణ మాత్రను తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించుకోవచ్చని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ.. మండల, పట్టణ పరిధిలో మొత్తం 8,536 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు గైర్హాజరైన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన నిర్వహించే మ్యాప్-అప్ కార్యక్రమంలో మాత్రలను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ఎడిటోరియల్

హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలను విస్తరించడంలో భాగంగా మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు మెట్రో రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో హెూల్ సెల్ ఇండియా హైదరాబాద్ దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ఎల్ అండ్ టికి మెట్రోపై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. రూ.2,000 కోట్లు వన్-టైం చెల్లింపులను చేపట్టాలని ఎల్ అండ్ టి కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ

# ఇక సర్కారీ మెట్రో..


స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2ఏ, 2బి విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టి భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని కేంద్రం సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టి భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని సిఎం తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు కచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సిఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందు వల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టి సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2,100 కోట్లు బకాయి ఉందని ఆయన గుర్తు చేశారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు

## కమలంలో లీక వీరులు ఎవరు...

"మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దనిచెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం"..అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఏం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే. ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది. బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్ ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతో కాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ.. మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

**ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు.**



కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు

బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

## గన్నవరంలో వంశీకి కలిసొచ్చేనా

గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి. ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నం చేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో , ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. వల్లభనేని వంశీ ఇటీవల వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశమైంది. వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు. తనపై పదకొండు కేసులు నమోదయ్యాయని, ఇంతకు మించి ఏం చేస్తారన్న ధీమా వల్లభనేని వంశీలో స్పష్టంగా కనిపిస్తుంది.

## పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు

ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. లేటెస్ట్ వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది. ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది.